వేంకటరత్నము, న.

ఆంధ్రహృదయము

ఏలూరు, 1927

Record no. 713

Vēṅkaṭaratnamu, Na.

Āṃdhrahṛdayamu

Ēlūru, 1927

Record no. 713

వేంకటరత్నము, న.

ఆంధ్రహృదయము / న. వేంకటరత్నము.- ఏలూరు : ఆనంద నికేతనము, 1927.

67 p. ;19 cm.

Record no. 713

Vēṅkaṭaratnamu, Na.

Āṃdhrahṛdayamu / Na. Vēṅkaṭaratnamu.- Ēlūru : Ānanda Nikētanamu, 1927.

67 p. ;19 cm.

Record no. 713

ఆంధ్రహృదయము

న. వేంకటరత్నము

ఆనంద నికేతనము
ఏలూరు * పశ్చిమగోదావరి

To C. Ramalingareddi garu M. A.

With best regards of the Author

N. Venkataramanam

1.12.27

ఆంధ్రహృదయము

దీని వెల
అర్ధరూపాయి

ఆంధ్రహృదయము

శ్రీ వేంకటరత్నము

"న్యాయ్యాత్పథః ప్రవిచలన్తి పదం న ధీరాః"

ఆనంద నికేతనము
ఏలూరు * పశ్చిమగోదావరి

మొదటి ముద్రణము

నవంబరు ౧౯౨౪

శ్రీ అద్దేపల్లి లక్ష్మణస్వామినాయుడు గారిచే
సరస్వతీ పవరు ప్రెస్సునందు ముద్రితము

***

కీ. శే. వేంకట మహాలక్ష్మికి

అక్కా, నీ పవిత్ర స్మృతికి ఈ చిన్ని గ్రంథమును ప్రేమపూర్వకముగా అర్పించు చున్నాను. నీవు జీవించిన ఇరువదైదు వత్సరములలో మాపై జూపిన అనంతమైన ప్రేమకు ఈ మాత్రపుకానుక చాలదని నే నెఱుంగుదును. నీకోసము—నీ ఆత్మశాంతికొఱకు పరమేశ్వరున కర్పించిన కన్నీరు కంటె ఇది యెక్కువది కాదని కూడ నెఱుంగుదును. అయినను నీపవిత్రవంతమైన స్మృతికిదీనిని అంకితమొనర్చవలెనని హృదయము పలికినది; కనుకభక్తితో సమర్పించుచున్నాను.

***

ఒకటి రెండు మాటలు:

సంఘమును నుద్ధరించవలె నను తలంపుతో మేము దీనిని వ్రాయలేదు. మాహృదయమున ఎన్ని నాళ్లనుండియో రహస్యముగ పెరిగి పోవుచున్న భావసముదాయము కన్నులకు గనిపించినప్పుడు అక్షరరూపము నిడుటయే మావ్రాతలకు మూలోద్దేశము.

ఇప్పుడు సజీవుఁడై యున్న సుప్రసిద్ధనవలాకారుడు హాల్‌కెయిన్ గారి **A son of Hagar** చదువుట పూర్తి జేసి ప్రభాతసమయమున నిది వ్రాయ ప్రారంభము చేసినాము. అయితే ఆనవలకును దీనికిని ఒక విధమైన సంబంధము లేకపోయినను నొకవిధమగు సంబంధ మున్నది. అంటే ఉత్తమగ్రంథము పఠించిన తరువాత కలిగిన ఆవేశముతో నిది వ్రాయబడినది.

ఈ చిన్నినవల యేగ్రంథము ననుసరించియు విరచించలేదు. ఇది కేవలము ఊహాజనితమైనది మాత్రమే. పండిపోయిన భావములకు నీరూప మిడి

నందుకు రసజ్ఞులు అధిక్షేపించజాలరు. ‘ఏదైన నొకటి వ్రాయవలె’ నని టేబిలు ముందఱ కూర్చుండి వ్రాసిన వానిలో నిది చేరదు. ఆభావములు హృదయమున చోటు చాలనప్పుడు మాత్రమే అక్షరరూపమును దాల్చినవి.

రాజమహేంద్రవరము
౨౫ జనేవరి ౧౯౫౭

వేంకటరత్నము

పీఠిక

ప్రతిభగల రచయితకు రెండు గుణము లుండును. అతని భావమునందు, సంఘమునందు వ్యాప్తిగాంచిన భావము లెల్లను ఐక్యము నొంది సమన్వయము గాంచి యుండును. అనగా సమకాలికులకు ప్రతినిధిగానుండి భావికులకు తన కాలమునందలి యాశయములను, నడవడికలను, ప్రతిభను తెలుపుచుండును. అంతియ గాక సమకాలికుల సంకుచిత భావములను దాటి భవితవ్యమును తనదివ్యదృష్టితో జూచి దూరదృష్టిలేని వారికి రాబోవు శుభసమయమును గూర్చి ముందుగ జెప్పును. ఇందు వలన సమకాలికుల అభిప్రాయములు త్వరితముగ విశాలములై మానవ కల్యాణమును శీఘ్ర గామినిగా నొనర్చును. ఇట్టి వారు సారస్వత ప్రపంచమునే గాక సాంఘిక ప్రపంచమును గూడ శాసించి జీవన్మృతులై నిలచిపోవుదురు.

కాని వారి మాటలను గ్రహించి తదనుగుణ

ముగ బ్రజలు నడచుకొనరు. సృష్టి యందలి యితర జంతువులవలెనే మానవుడు గూడ అలవాటులను సులభముగ దప్పించుకొన లేని వాడు. (Man is a creature of habits). వానిలో మార్పు రానున్న తరి వాని మానసికజడత్వము (Mental inertia) సాధ్యమైనంత వరకు ఆ మార్పును ప్రతిఘటించును. వీలు తప్పినచో లొంగిపోవును. అందుచేతనే కార్లైలు వంటి రెండుకాళ్ళ తుపానులు చెలరేగి నపుడు ముద్రణాలయములు వారికి చోటీయవు. కాలము గతించిన కొలదిని వారి యధికారము ప్రబలమై మానవకోటి యొక్క భావ ప్రపంచము నాక్రమించును.

దేశమాన్నత్యమునకు వచ్చుట కిట్టి భావపుత్రుల రాక యవసరము. తెలుగు సారస్వతమున వీరేశలింగ మిట్టివాడు. తరువాత ఈవిషయమున పేరెట్టి చెప్పుటకు తగిన వారింతవరకును లేరు. కాని ప్రయత్నములు లేక పోలేదు. 'ఆంధ్రహృదయ' మిట్టి వానిలో నొకటి. దేశమునందును, సంఘమునందును, శాంతము సౌభాగ్యము నెలకొనవలె నన్న అందలి వివిధజాతులును, సంఘములును, ఆశయము లందును, జీవిత విధానములందును పరస్పర సహనశక్తి గలిగి మెలగుట యవసరము. ఈవిషయమునే గ్రంథకర్త యిందు విపులపరచియున్నాడు.

ఇంత మాత్రమున గ్రంథకర్త దీనిని, ఉపయోగమును మనసు నందిడుకొని వ్రాసెననుకొన నవసరము లేదు. రవీంద్రుడు వ్రాసినటుల 'కవి భావభరమైన హృదయముతో మాట్లాడును. విమర్శకులు వారి యిష్టము వచ్చినట్టు లర్థము చేసుకొందురు.' వేంకటరత్నముగా రిందలి భావములను చిరకాలము మననము చేసి చివరకు పుస్తక రూపమున వెల్వరించి తెలుగు భాషకొక క్రొత్తగ్రంథమును సమర్పించిరి. ఇది చదువరుల కానందమును, చిత్త సంస్కారమును గలుగజేయ గల గ్రంథము.

స్వదేశము, స్వభాష, స్వవేషము మరచి శ్రద్ధా భక్తులందు కొరవడిన ఆంధ్రులు దీనిని జదివి లాభమును బొందుదురు గాక! తన భావములను సలక్షణముగను ధైర్యముగను వెలిబుచ్చినందుకు గ్రంథకర్త అభివందనీయుడు.

గన్నవరము
26. 2. 1927

నిడమర్తి సత్యనారాయణమూర్తి

ప్రకరణము ౧

ముచ్చట గూర్చు గుర్రపుబండి దిగి నవయౌవనుడగు రాధాకృష్ణ రాజమహేంద్రవర రైల్వేస్టేషను మాస్టరు ఉద్యానపరివృతమందిరమును ప్రవేశించు చున్నాడు. కిటికీలో నుండి మిత్రునిరాక గాంచిన మాస్టరుపుత్రిక యగు గ్రేస్ దొరసాని యౌవనాశాహృదయ ముప్పొంగ నగుమోముతో ద్వారమున వ్రేలాడుచున్న పట్టుతెర తొలగించుకొని వచ్చి ఆతనికి స్వాగత మిచ్చినది. యజమాని యాజ్ఞానుసారము బండివాడు నూతనసంవత్సరాది ఉపహారములను లోనికి దీసికొనివెళ్లి మేజాపై నుంచి వెళ్లినాడు.

పనికత్తె యొకర్తుక "కృష్ణబాబు ఎవో బహుమతులు తీసుకొచ్చాడు" అనుకొనుచు నటుబోవుచుండుట జూచి రాధాకృష్ణ ఆమెచేతిలో నొక రెండురూపాయిలు పెట్టి "పండుగకేమైనా కొనుక్కో" అన్నాడు. అది వంగివంగి సలాములు చేయుచు ఆనందముతో వెడలిపోయినది.

గ్రేస్ దొరసాని నవ్వుచు "లోపలికి వెళ్లుదామురండి, మిస్టర్ కృష్ణా! కలకత్తామెయిలు వెళ్లినతర్వాత మా నాన్నగారు వస్తారు. ఈలోపున అమ్మ మీకేదో కబురు చెపుతుందట వినవచ్చు" అన్నది. ఇరువురు నూతన యౌవనులు మెల్లగా లోనికివెళ్లి మేజాకిరుప్రక్కలనున్న కుర్చీలలో నాసీనులైరి.

రాధాకృష్ణ మధురమందస్మితవదనమున "మిస్ గ్రేస్, నేనిక్కడి కీరోజు ఊరికే రాలేదు. మీతో క్రొత్త వేషం వేయించడానికి వచ్చాను. అచ్చంగా మిమ్మల్ని ఆంధ్రయువతిని చేసివేయడానికి వచ్చాను. అందుకు ఒప్పుకుంటారా?" అన్నాడు. సూక్ష్మబుద్ధిమతి గ్రేస్ దొరసాని. రాధాకృష్ణుని తేటమాటలలోని దివ్యసంగీతము ఆమె ఆనందహృదయమున నాలకించినది. చిఱునవ్వుతో "ఆంధ్రదేశంలో పుట్టి, ఆంధ్రవాతావరణలో పెరిగి, మీవంటి ఉత్తమాంధ్రులతో స్నేహం చేసి, కొద్దోగొప్పో ఆంధ్రము చదువుకొన్న నేను మీకోరిక ఎల్లా తిరస్కరించుతాను. ఆసంగతి మీకు మాత్రము తెలియనిదా ఏమిటి" అన్నది.

కృష్ణ "మిస్ గ్రేస్, మీరలాంటివారని తెలిసే

ఇవ్వాళ ఇటువంటి బహుమతులు తీసుకొచ్చా" నని ఉపహారములపళ్లెరము పైనున్న రంగుఅంచులరుమాలు తీసి అందున్న ఆకసపురంగుపట్టుచీరె, చాక్లెట్ రంగు క్రొత్తరకపు జాకెట్టు గ్రేస్ చేతులలో బెట్టినాడు. ఆమె ఒయ్యారముతో గైకొని "మెనీథాంక్సు, మిస్టర్ కృష్ణ" అన్నది. కృష్ణ "మొన్న కలకత్తానుంచి వచ్చినప్పుడు బాగా ఆలోచించి పరీక్షచేసి మరీ తీసుకొచ్చాను. మాచెల్లెలు కూడా చాలా బాగున్నది, రంగుమెంచడము అన్న" దనుచుండగా స్టేషనుమాస్టరుభార్య వచ్చి "మిస్టర్ కృష్ణా! మీరొచ్చి ఎంతసేపైంది. నేను చూడనేలేదు మిమ్మల్ని" అన్నది. రాధాకృష్ణ చిరునగవుతో "సంవత్సరాది రోజున మీరు నన్ను చూడలేదంటే సంవత్సరమంతా యిల్లాగే ఉంటుందన్నమాట. ఈ బహుమానాలు స్వీకరించండి" అన్నాడు.

ఆపళ్లెరమున ఇంకను విలువగలకేక్సు, ఒక బంగారు చేతిగడియారము, మంచిముత్యాలహారము, ఒక బంగారు బ్రూచ్, పాంపియోసెంటు, లోషను, సిల్కుచేతిరుమాళ్లు డజను, సిల్కుగొడుగు, నూతనసంవత్సరాది కార్డులు నున్నవి.

అప్పుడే స్టేషనుమాస్టరు వచ్చుట చూచి రాధాకృష్ణ లేచి "గుడ్‌మార్నింగు" అని షేక్ హేండు చేసి మరల తనకుర్చీలో నాసీనుడైనాడు.

మాస్టరు, ఆతనిభార్య ఐక్యకంఠమున "కృష్ణబాబు, మీరు అద్భుతులండీ, గ్రేస్‌కుచీరె, జాకెట్ తీసుకొచ్చారు" అనిరి.

రాధాకృష్ణ నవ్వి ఊరుకొన్నాడు. మాస్టరుభార్య "కృష్ణబాబు, ఈరోజంతా మిమ్మల్ని ఇక్కడ బందీ చేసివేస్తాము. మీరిక్కడుండి పోవాలి" అంటే మాస్టరు "మిస్టర్‌కృష్ణ, మీరు ఈరోజు మాయింట్లో భోంచేయవలె" అన్నాడు.

కృష్ణ "అందుకేమీ అభ్యంతరముంచను. కాని శాఖా——"

మాస్టరు "అల్లాగే, మీకోసం శాఖాహారాలే చేయించుతాను ఈరోజు." రాధాకృష్ణ కుర్చీనుండి లేచి పళ్లెరములోని ఒకకార్డు మాస్టరుభార్య చేతిలోనుంచి పళ్లెరము మాస్టరుచేతి కందజేసి "మీకీ సంవత్సరం శుభమవుతుంది" అన్నాడు.

మాస్టరు ఉపహారముల నందుకొని ప్రక్కనున్న

గ్రేస్‌కిచ్చి "మీరు నన్ను మన్నించాలి. ఉదయం మెయిలు వేళయింది. మీరు రావడం చూసి వచ్చాను. ఇప్పుడే తిరిగి వస్తాను" అని వెళ్ళిపోయినాడు.

మాస్టరుభార్య ఎక్కువ తెలివిగలది కాకపోయినను అవివేకి మాత్రము కాదు. ఆమెకు రాధాకృష్ణ, గ్రేస్ సంభాషణము వినుట ఆనందదాయకముగా నుండును. కాని తానటనున్న వారి యానందమున కంతరాయము కలుగునేమో యని ఏదో పనిపేరు చెప్పుకొని వెళ్ళిపోవుట ఆమె కాచారము. ఆమె "కృష్ణబాబు, కొంచెము పనివున్నది. ఇప్పుడే వస్తాను" అని వెళ్లిపోయినది.

గ్రేస్ "కృష్ణబాబు మీ చెల్లెల్ని తీసుకురాకపోయినారూ! ఈ రోజు ఆమె కూడా ఇక్కడకాలము గడుపునుగా. అంతేకాదు ఆమెతో నా కొక అవసరంకూడా కలిగిందిప్పుడు"

రాధాకృష్ణ తనలోతాను నవ్వుకొని "నాకు తెలుసు నా అవసరమేమిటో. ఆంధ్రదేశములో పెరిగిన ఆడుబిడ్డకు చీరె కట్టుకొనడము చేతకాదని కూడా నాకు తెలుసులెండి" అన్నాడు.

శాంతరసము తొల్కాడుచుండు గ్రేస్ నయన

ద్వయము నొక్కసారిగా కృత్రిమకోప మావరించినది
స్వభావసిద్ధమగు నామె శాంతిమయసౌందర్యమున కీ
భావపరిస్ఫుటము ముఖాలమున క్రొత్తయందము వచ్చి
నది. పిల్లవాయువుచే అల్లలనాడు అరటిమువ్వవలె
కదులుచున్న ఆమె మోవి చూచి రాధాకృష్ణుని
యౌవనహృదయ ముద్విగ్నమై పోయినది. తెలివిగల
వాడగుటచే నాతడు వెంటనే హృదయమును త్రిప్పు
కొన్నాడు కాని హృదయాంతరమున తనకు తెలియ
కుండగనే అణిగియున్న యౌవనాశ నేత్రములలో వ్యక్త
మగుచుండుట గ్రేస్ ఉత్తేజనచిత్తమై యున్నను గమ
నింపకపోలేదు. కాని అప్పు డామె హృదయ మాదిక్కు
గా లేకపోవుటచే రేకెత్తుచున్న ఆవేశమునకు వశమై
“కృష్ణబాబు, మీరల్లా అనడములో ఎక్కువ న్యాయం
లేదు. ఇది మా సంఘలోపము. ఈ యాంగ్లోఇండి
యను జాతికి కారకుడైన దూష్లే లోపము. మీకు శక్తి
యున్న అతన్ని, రోజురోజుకి అణిగిపోతూవున్న మా
జాతిని దూషించండి. చూడండి, మా జాతి ఎటూ
కాకుండా పోయింది. అటు ఆంగ్లేయులలోనూ కలియ
లేదు. ఇటు భారతీయులలోను కలవదు. అంతేకాదు.

మాలో వేలుపెట్టి చూపుట కొక్క సుప్రసిద్ధవ్యక్తి
బయిలుదేరనేమొ చెప్పండి.”

కృష్ణ “నిజమే, మిస్ గ్రేస్!”

గ్రేస్ “అంతేకాదు. నామట్టుకు నేనున్నా నను
కోనండి. నాజీవిత మెల్లావుంది. చీకటిలోని పావురము
వలెఉంది. చిన్నప్పటినుంచీ ఆంధ్రదేశంలో, ఆంధ్ర
వాతావరణలో పెరిగినా, ఆంధ్రుల అందమైన
ఆచారాలూ, ముద్దుల మాటగట్టు ఆంధ్రభాష,
వారిజీవనం తెలియదాయె. అటు యూరోపియనుల
ఉత్సాహవంతమైన జీవనశక్తి గ్రహించడానికివీలు
లేక పోయింది. ఇట్టి స్థితిలో చీరె కట్టుకొనడము
నాకు చేతకాదని అంటారెందుకు మీరు” అని తన
ఆవేశమునకు తానే ఆశ్చర్యపడి పకపకనవ్వినది.
రాధాకృష్ణ కూడ నవ్వకుండ నూరుకో లేకపోయినాడు.
కృష్ణ నవ్వుచు “నిజమేనండీ! మిస్ గ్రేస్, మీవంటి
వ్యక్తులు మీ జాతిలో కనిపించడము కష్టము.” గ్రేస్
మరల ఆవేశమై “అదుగో మీరు మళ్ళీ నాఆవేశానికి
దోహద మిస్తున్నారు. నాలో ఏమున్నదండీ గొప్ప.
ఈమధ్య బెర్నార్డుషా పుస్తకాలు కొన్ని చదివాను.

చూడండి. అతని విప్లవకరమైన భావాలు. నిజంగా అతడు రెండుకాళ్ళతుపాను వంటివాడే. ఇంగ్లీషుజాతి నంతా వూపివేస్తున్నాడు. లోపభూయిష్టమైన ఇంగ్లీషు జాతిని సంస్కరించవలె నంటే అటువంటి వాళ్ళేబయలు దేరాలి. లోపాలు ప్రతిజాతిలోను ఉంటవి. కాని మా యాంగ్లోఇండియనుజాతిలో ఎక్కువ. ఈజాతి కేనాడైనా ముక్తి ఉందా అని విచారము కలుగుతుంది. బెర్నార్డుషాలో వందోవంతు ప్రతిభగల ఒక మహా పురుషుడు బయలుదేరినా మాజాతి బాగుపడుతుంది. అంతకూడా అక్కర్లేదు. అటువంటి పుస్తకాలు చదివినా చాలు, ఈ సీతాకోకరంగుల వేషాలు, ఈతిండిపోతుతనము మాని. కృష్ణబాబు, నాకొక్కొక్కప్పుడు కళ్ళ వెంట నీళ్ళు కూడా వస్తవి, మాజాతి నికృష్టావస్థ తలుచుకుంటే. అప్పుడు డూప్లేను శపించుతూ వుంటాను. మా జాతి మూలకారకులైన ఇంగ్లీషు వారిని——” అన్నది.

రాధాకృష్ణ కొంచెము సేపూరుకొని నవ్వుచు “మిస్ గ్రేస్, మీది చాలా ఆవేశంగల రక్తమండీ——అవును గాని ఈబెర్నార్డుషా ఎవరండీ?” అని మఱింత నవ్వినాడు.

గ్రేస్ మంజులమైన సుస్నిగ్ధ గండఫాలముపై చిఱునగవు వెన్నెలలు తాండవమాడ “ఏమండీ, కృష్ణబాబు, కలకత్తాలో చదువుకొనుచున్న విద్యార్థులు మీరు. అందులోను యమ్. యస్. సి. M. Sc. వంటి పెద్దపరీక్షకు చదువుచున్న విద్యావంతులు. ఈశ్వరదాసు యం. ఏ. గారి వంటి విద్యాసంపన్నుని పుత్రులై వుండి కూడా బెర్నార్డుషా అంటే ఎవరో తెలీకపోవడం చాలా అన్యాయం. అతని గ్రంథమొకటి ఇస్తాను ఈసెలవల్లో చదవండి.”

హాసోల్లాసితవదనుడగు రాధాకృష్ణ “నిజమే గాని మిస్ గ్రేస్, మీ జాతి అన్ని జాతులకంటె నికృష్టమైనదంటారు. ఆంధ్రు లెటువంటి పతనస్థితిలో ఉన్నారో మీకు తెలియదు. మా జాతి కూడా అటువంటి స్థితిలోనే ఉంది. అంతకన్నా తక్కువ అని కూడా అనవచ్చు.”

గ్రేస్ “కృష్ణబాబు, ఏమి అల్లా అంటారు. స్త్రీలలో మీ చెల్లెల్ని ఉదాహరణంగా తీసుకోండి. ఇప్పుడు మద్రాసు క్వీన్‌మేరీస్ కాలేజిలో చదువుచున్న మీ చెల్లెలి హృదయము తెలిసికోండి. పురుషుల్లో మీ

తండ్రిగారి హృదయము గ్రహించండి. ఏ జాతికైనా హృదయం ముఖ్యం. అదీకాకుండా మీకు మీ ఆంధ్రుల ఆచారాలలోని అందం, కట్టుబాటులలోని ప్రయోజనం, వేషభాషలలోని మాధుర్యం, ఈ వాతావరణలోని పరిమళం ఎక్కువగా తెలిసికోవడానికి ప్రయత్నిస్తేనే గాని అర్థంకాదు. నేను మాత్రం మా జాతిని తెలిసికోవడానికి ప్రయత్నిస్తూనే వున్నాను రెండేండి మొదటినుంచీ” అని పకపక నవ్వినది. కృష్ణ “మీకంతా కలిపి 18 సంవత్సరాలు లేవు—” అని నవ్వినాడు. ఆ నవ్వులో కేవలము అమాయకత్వము పరిస్ఫుట మగుచున్నది. విమలమైన అతని భావార్థము గ్రహించి గ్రేస్ “మీరు ఇంత అమాయకులు. యం. యస్. సి ఎల్లా చదువుచున్నారండీ” అన్నది.

*   *   *   *

గ్రేస్ యభిలషితార్థము రాధాకృష్ణ అపరాహ్ణప్రారంభసమయమున చీటి వ్రాసి పంపగా వెంటనే అతని చెల్లెలు సొంతగుర్రపుబండిపై నచటికి వచ్చినది. గ్రేస్ రాధాకృష్ణులు నామె నెదుర్కొనుటకెదురుగా వెళ్లిరి. గ్రేస్ మందస్మితాననయై “మిస్ సరళాదేవి, ఈ రోజు

మీకు క్రొత్త నాటకము చూపించడానికి పిలిపించాము” అన్నది.

సరళ షేక్‌హాండు చేసి “ఈ నాటకములో నాయకుడెవరైవుంటారు” అని నవ్వినది.

ఆ తేటనవ్వులో నెట్టి భావమును లేదు. విమలహృదయ యగు గ్రేస్ క్రొత్తభావమును కల్పించుకొనునట్టి చంచలచిత్త కాదు.

రాధాకృష్ణ పూవులుగాయు నవ్వుతో “చెల్లీ, ఇది నాయకుడు లేని నాటకం. సాధారణంగా గ్రంథకర్తలేదేశమువారైనా ఇంతమట్టుకు పురుషులులేని స్త్రీల నాటకమూ, స్త్రీ లేని పురుషుల నాటకమూ వ్రాసి వుండలేదు. కాని నేను మాత్రము క్రొత్తరకంగా ఈ రోజున ఒక్క రమణీమణినే కథావస్తువుగా పెట్టి వింత నాటకము వ్రాశాను. ఈ నాటకములో పురుషుడు లేడు” అన్నాడు.

గ్రేస్ “మీ నాటకము ప్రస్తుతం బాగుంటుందేమో కాని భవిష్యత్తులో మాత్రము సరసంగా వుండదేమో అని తోస్తుంది.” ముగ్గురును నవ్వుకొన్నారు. గృహాంతరాళమున కేగిన పిదప గ్రేస్ చీరె, జాకెట్టు, బ్రూచ్

తీసికొని వచ్చి గభీరభావముతో నా వస్తువులను సరళాదేవి హస్తకమలముల బెట్టినది. అమాయికహృదయయగు దేవి నవ్వు నాపుకోలేకపోయినది.

సరళ "మిస్ గ్రేస్, నాటకశాలలోకి మిమ్మల్ని చక్కని చుక్కలాగు తయారు చేస్తాను రండి" అని గ్రేస్‌ను లోనికి గొనిపోయినది.

గ్రేస్ మందగమనయై మయూరిపోలిక వెళ్ళుచు "కృష్ణబాబు, నేను వేషము వేసుకువచ్చిన తర్వాత మీరు నన్ను గురించి టైమ్సుఆఫ్ ఇండియాలో పొగుడుతూ 'స్టార్' అని వ్రాయాలి సుమండీ" అన్నది. పావుగంటసేపైన పిదప ఇరువు రాంధ్రరమణీమణులు వచ్చి సోఫాపై నాసీనులైరి. సరళాదేవి నవ్వు పట్టలేకుండెను. అందరు ఒకరిని చూచి యొకరు కడుపులుబ్బునట్లు నవ్వుకొనిరి.

గ్రేస్ అప్పుడు కేవలము రతీదేవి దిగివచ్చినట్టులే యుండెను. ఆ నిరుపమసౌందర్యావలోకనమున రాధాకృష్ణుని స్థిరచిత్తము కూడ నతనికి తెలియకుండగనే మారిపోయినది. కాని నవ్వులో నాతడాపరివర్తనమును గ్రహింపజాలక పోయినాడు. అకస్మాత్తుగా గ్రేస్

గభీరవదనయై "కృష్ణబాబూ, నా చిరకాలవాంఛను తీర్చినందుకు మిమ్మల్ని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. ఈ విషయమున సాయపడిన మా సరళాదేవికి కూడా కృతజ్ఞత చూపకుండా వుండలేను. కాని కృష్ణబాబు, ఆంధ్రరమణుల చీరెకట్టులోని సౌందర్యం, వారి శాంతమయనయనములలోని మాధుర్యం, వారి కట్టుబాటులలోని గాంభీర్యం చూచినప్పుడు నాహృదయముప్పొంగి పోతూవుంటుంది. నేను చీరెకట్టుకోవాలనీ, ఆంధ్రరమణితో స్నేహము చేయాలనీ ఎన్నాళ్లనుంచో నా లేతహృదయంలో కోరిక పెరిగి పోతూవుంది. కృష్ణబాబు, ఆంధ్రుల మధ్యపుట్టి, ఆంధ్రుల పవిత్రభూమిలో పెరిగి, ఆంధ్రుల సొంతగాలితో జీవించిన నాకు ఇటువంటి కోరిక వుండడములో అబ్బుర మేముంది? మీ కుటుంబముతో స్నేహము కలియడం మూలమున నాకోరిక నేటికి సఫలమైంది. ఇందుకు మీకెంతో కృతజ్ఞనై వుంటాను" అన్నది.

సరళారాధాకృష్ణు లొకరినొకరు వీక్షించుకొని అవనతమస్తకు లైనారు. అర్ధనిమీలితనేత్రుడైన రాధాకృష్ణు డొకనిముసములోనే శిరస్సు నెత్తి భావగర్భితమై

మధురతమమైన మాట యొక్కటి మనసార అన్నాడు: "మిస్ గ్రేస్, నిజమే."

సరళ "మిస్ గ్రేస్, మీకిటువంటి ఆదరము, అభిమానము ఆంధ్రజాతిపై వుండడము నిజముగా మాభాగ్యము" అన్నది.

ఉద్విగ్నచిత్తయగు గ్రేస్ మరింతగభీరముగ "మిస్ సరళా, అంతేకాదు. నేనాంధ్రులలో కలిసిపోయి ఆంధ్రజీవనశక్తిలో మిళితమైపోయి నాజీవితాన్ని ధన్యపరచుకొందామనుకుంటాను.—ఫిడేలు తీసుకొస్తాను. మీరు తప్పకుండా ఈరోజు కొన్ని తెలుగుపాటలు పాడాలి" అని పరుగున లోనికి పోయి ఫిడేలు గైకొనివచ్చి సరళాదేవి ఒడిలో నుంచినది. సరళ నూతనోత్తేజముతో "మిస్ గ్రేస్, ఇదివరకల్లా మిమ్మల్ని తప్పించుకొన్నాను. ఆంధ్రుల చీరెధరించి ఆంధ్రస్త్రీ అయిపోయిన మీకోరిక ఇవాళ తిరస్కరించలే" నని ఫిడేలు సరిజేసికొని వరుసగా త్యాగరాయ, దీక్షిత, శ్యామాశాస్త్రి, సుబ్రహ్మణ్య, సదాశివరావుకృతులు అమృతరసము తొల్కాడునట్లు గొంతెత్తి కోకిలమధుర స్వరమున నిరుపమేయముగ బాడినది. పాడుచున్నంత

సేపును గ్రేస్ ఆనందము భరింపలేక సరళాదేవి తొడపై చరిచి "బేష్, బేష్, బేష్" అనుచున్నది. చీర ధరించిన గ్రేస్‌వంటి అనుపమానరూపలలిత సౌందర్యకలిత ప్రక్కనుంటచే గాబోలు నేడు రాధాకృష్ణునికి చెల్లెలి దివ్యసంగీతములోని అనంతమాధుర్యము పూర్తిగా గోచరించినది. ఆతడానందపులకితుడైపోయి "చెల్లీ, ఏది! సంకల్పమెట్టిదో మరలా ఒకసారి పాడు" అన్నాడు.

సరళాదేవి నవనవోత్సాహభరితహృదయయై ఆనందమున అమృతమొలుకునట్లు ఆ కృతి యిట్లు పాడినది.

ప. సంకల్ప మెట్టిదో మనసా. నీ.
సాకేత నిలయుడా రామ. నీ.
అ. పంకేరుహాసనాసీనుడైన బ్రహ్మకైన తెలు
సునో తెలియదో. సం.
చ. సర్వజీవాంతఃకరణాసీనుడై సర్వ భూతము
లకు సాక్షివై యుండగా సర్వేశుడా
శ్రీవెంకటేశసార్వభౌమ సకలనిష్కామ. నీ.

దీని భావార్థము సరళాదేవి ఇదివరకే గ్రేస్‌కు చెప్పియుంటచే నాభావము లోని విజ్ఞానము, కంఠస్వరములోని మాధుర్యము నామె యనుభవించి "మిస్

సరళా,అబ్బా మీ తెలుగులో ఎంతమాధుర్యమున్నదీ." అని కొంతదను కూరకుండి "చెప్పగా చెప్పగా మా ఇంగ్లీషు సంగీతములోని నిగ్గే చెప్పాలి" అన్నది. సరళాదేవి చిఱునగవు చేసి "మాపై నున్న అభిమానం వల్ల మీకల్లా తోస్తూవుంది'' అన్నది.

గ్రేస్ నవ్వుచు "అవునుగాని కృష్ణబాబు, సంవత్సరాది రోజు ఇంత సంతోషంగా వున్నందుకు సంవత్సరమంతా ఈలాగేవుంటామని స్ఫురిస్తూంది. ఇవాళ సంతోషానికి తోడు బొమ్మూరుమెట్ట కేసి మనముగ్గురుమూ షికారు వెళ్ళితే ముత్యానికి పరిమళ మబ్బినట్లుంటుంది" అన్నది.

రాధాకృష్ణ చెల్లెలి కేసి చూచినాడు. అందులకామె అంగీకారమును సూచించుచు తరళనయనముల తోడనే జవాబు చెప్పినది. గ్రేస్ మంజులముగ నవ్వుచు "మౌనం అర్ధాంగీకార సూచనం" అని ముసలితల్లి వద్ద సెలవు గైకొనుటకు లోనికి జనినది.

మాస్టరుభార్య ఆశ్చర్యాన్వితహృదయ యై "గ్రేస్ నీ వీరోజు చాలా అందంగా వున్నావు. లేతతీగెఅంతా పరిమళవిలసితం అయిన ట్టున్నావు. కృష్ణబాబుకు

అభివందనా లర్పించావా ?" అన్నది. గ్రేస్ ప్రత్యుత్తరముగా తలయూపి "అమ్మా, కృష్ణబాబు సరళాదేవి నేను ఇవాళ బొమ్మూరుమెట్ట కేసి షికారు వెళ్ళుతాము '' అన్నది.

తల్లి అనుమతి ఈయగా మరాళమువలె నడుగులిడుచు నచటికి వచ్చి "మిస్ సరళా, వెళ్ళుదాము లెండి" అన్నది.

సరళ "నేను రావడానికేమీ అభ్యంతరము లేదు కాని ఈసాయంకాల మొకరింటికి వస్తానని వాగ్దత్తం చేసివున్నాను"

గ్రేస్ "నేనూచేశాను వాగ్దత్తం బొమ్మూరుమెట్టకి, ఇవాళ మిస్ సరళను తీసుకొస్తానని" అని పకపక నవ్వినది.

సరళ "మీ యిద్దరు వెళ్ళండి యీ రోజుకి, క్రొత్త చీరెలో మీ రెంతో ముచ్చటగా వున్నారుకూడాను."

గ్రేస్ "నే నొప్పుకోను. బలవంతాన తీసుకువెళ్తాను" అని యామె లలిత హస్తద్వయమును పట్టుకొని లేవదీసి "కృష్ణబాబు, రండి వెళుదాము" అన్నది.

రైలుబద్దీల వెంటవెళ్ళుచు వారెన్ని విషయముల

గూర్చియో మాటాడుకొన్నారు. సంభాషణావిషయములు తరంగములపై తరంగములవలె నెటనుండి వచ్చుచున్నవో వారికే తెలియదు.

నడుమ నొకరిద్దరు గ్రేస్ పరిచితలు కాన్పించియు నామె నానవాలు పట్టలేకపోయిరి.

పట్టాలు ప్రక్కనున్న ఇసుకతిన్నెపై గూర్చుండిన యిద్దరు బి. యే. విద్యార్థులు "ఒకామె ఈశ్వరదాసు మేస్టారు కూతురులాగున్నది. ఈ రెండో ఆవిడ ఎవరయ్యా నూతనవ్యక్తి లాగుంది? మన ఆంధ్రుల్లోకూడా షికార్లు పద్ధతి పుట్టింది క్రొత్తగాను." అని తమ సంకుచితభావముల నొకరి కొకరు తెలుపుకొనిరి. యూనివర్సిటీ వారి నట్లు తయారు చేసినది. అందు కెవరేమి చేయగలరు?

కాని ఆ యానందమధురమూర్తు లటులనే సంభాషించుకొనుచు బోవుచుండిరి. మెట్ట నధిరోహించిన పిదప నడక అలవాటులేని సరళాదేవి యొకించుక ఆయాసమును సూచించినది. కుశాగ్రబుద్ధిమతియగు గ్రేస్ అది గ్రహించి "కృష్ణబాబు, ఈ మామిడిచెట్టు చాలా అందంగా ఉంది. రవంతసేపు ఈ శిలాఖండం మీద

కూర్చుండి మరీ వెళుదాము. కాని ఏదీ మీ కలకత్తా ప్రార్థనసమాజంలో పాడే పాటొకటి పాడండి చూద్దాము ఎలావుంటుందో" అన్నది.

సరళ "పాట ఎలా వుంటుంది పాటలాగానే వుంటుంది" అన్నది. ఈ లోపున రాధాకృష్ణ గొంతు సవరించుకొనుట గ్రేస్ కనిపెట్టి "అవును నిజమే మిస్ సరళ పాట పాట లాగానే వుంటుంది. అందులో అబద్ధమేమీ లేదు. ఏది కృష్ణబాబు, మంచివారు, మిత్రుల మాట త్రోసివేయలేరు" అన్నది. సరళాదేవి, గ్రేస్ తలవంచుకొన్నారు, ఆయన పాట ప్రారంభము చేయువరకు. మధురమోహనకంఠమున రాధాకృష్ణ యిట్లుపాడినాడు.

ఆనందామృతనమః బ్రహ్మానందామృతనమః

మానసమందిర ధ్యానాభిముఖ సంధాన మహానుభవత్పదనమః

భర్గనిరామయనమః

మునివర్గాధిపఘనమః

స్వర్గాలయనిరవయవతిశయసుఖ

దుర్గశుభోదయనమః .ఆనంద.

సారనిరాంతకనమః

c

దుర్ఘోరదోషహరనమః
పారమార్థ విశ్వాభిరామశివ
భూరిలోక విశ్వంభరనమః .ఆనంద.
దేవనిరంజన నమః
సద్భావసదాశ్రయనమః
జీవజగన్మయానంతదయామయ
పావనపరబ్రహ్మాత్మకనమః .ఆనంద.

గీతారంభమున పురుషకంఠము వలె నున్నను గొంతెత్తి పాడినపుడాస్వరము సన్ననిదై మాధుర్యమున రమణీకంఠస్వరమును దలపించినది. సరళాదేవి తన సోదరు డింత మధురముగ పాడగలుగు నని యెన్నడు నెరుగదు. గ్రేస్ ఆశ్చర్యాన్వితయై యాతని వంక రెప్ప వాల్పక జూచినది. రాధాకృష్ణ గీతాతాత్పర్యమును విపులముగా గ్రేస్‌కు జెప్పినాడు.

గ్రేస్ ఆవేశపూరితహృదయయై "అబ్బా, బ్రాహ్మల భావాలు ఎంత విశాలమైనవి!—పాపం! మా క్రైస్తవుల లాగు వారికి క్రైస్తుద్వారా దైవాన్ని ప్రార్థించడము తెలియదు లాగుంది. ఏమోనండీ! కృష్ణబాబు, మా క్రైస్తవులు దైవప్రార్థన చేసేటప్పుడు క్రైస్తును

మధ్యవర్తిగా పెట్టుకొని చేయడము నాకు కంటగింపుగా వుంటుంది" అన్నది.

రాధాకృష్ణ "అవును మిస్‌గ్రేస్, మీ వంటి విశాల భావాలు కలవారికి క్రైస్తవమతంలో లోపాలు కనిపించడములో ఆశ్చర్యములేదు. మీకు రాజా రామ్మోహనరాయి, కేశవచంద్రసేను గ్రంథాలిస్తాను. చదివి మీ అభిప్రాయం చెప్పండి. మీ వంటి విశాలహృదయానికి ఈ మతం సంతోషప్రదంగా వుంటుందని తలుస్తాను." అన్నాడు.

గ్రేస్ "ఇవ్వండి తప్పకుండా చదువుతాను. మన మిస్ సరళ చదివిందేమో ఆ పుస్తకాలు."

సరళ నవ్వుచు "మానాన్నగారు నేనుస్కూలుఫైనలు చదువుతున్నపుడే అవి చదివి వినిపించారు నాకు. కాని స్కూలువాళ్లు మాత్రం చెప్పలేదు సుమండీ. మా స్కూలు పెద్దమనుష్యులకు ఇటువంటి గ్రంథాలు గిట్టవు."

కొంతసేపచట గూరుచుండి మెల్లగా మెట్ట చివర భాగమునకు వెళ్ళి వారు మువ్వురు నిలుచున్నారు. గభీరమైన భావముల నుదయింపజేయుచు ఉత్తమహృద

యులకు నుత్తమోత్తమపాఠములను గరపు ఆ మనోహరప్రకృతిదృశ్యమును గాంచి వారు ఒక్కింతసేపు నిశ్శబ్దులై నిలువబడి పోయినారు.

గ్రేస్ "కృష్ణబాబు, చూశారా? ఏమి కనిపిస్తూంది."

కృష్ణ నవ్వుచు "చెట్లూ చేమలూ కనిపిస్తున్నవి."

గ్రేస్ మరింత నవ్వి "చేమలూ కాదు. చీమలూ కాదు కనిపించేవి__(ఉప్పొంగుచున్న భావావేశము నణచుకోలేక గభీరవదనమున) అదికాదు కృష్ణబాబు కనిపించేది. నేను చెప్పుతాను వినండి. ఈ ఎత్తైన కొండమీది నుంచి చూస్తూన్న విశాలదృష్టికి కనిపించేది ఆనందలీలాక్షేత్రం. లోకమంతా ఒక ఆనందపు తునుక అని మీకు స్ఫురించడములా? ఈ విశాలదృష్టికి చిన్నిచిన్ని భేదాలేమీ వుండవు. భేదాలు సంకుచిత దృష్టికే. ఆ కనిపించేది ఆనందలీలాక్షేత్రం గాదా మిస్ సరళ!" అన్నది.

గ్రేస్ శాంతమయసౌందర్యనయనములపై సరళాదేవి గభీరభావతరంగితములగు దృక్కులబరపి మెల్లగా "అవును మిస్‌గ్రేస్" అన్నది. కృష్ణ "నిజమే మిస్" అన్నాడు.

నాడు శుక్లపక్షఏకాదశి. సూర్యాస్తమాన, సుధాకరోదయమధ్యస్థ సమయమది. అడుగులో నడుగువేసికొనుచు మెల్లగా ముగ్గురు పర్వతావరోహము చేయుచుండిరి. గ్రేస్ తనలో తాను అతిమెల్లగా స్వరముం బ్పాడుచున్నది. సమయము దొరికినదని సరళాదేవి "ఒక్క ఇంగ్లీషుపాట పాడు" మన్నది, గ్రేస్‌ను జూచి.

గ్రేస్ ఇట్లు ప్రత్యుత్తర మిచ్చినది "మీ రిద్దరూ నా కోర్కె తీర్చారు. నేను మాత్రం మీ కోర్కె తీర్చలేనందుకు విచారంగావుంది. నిజము చెప్పుచున్నాను. మిస్ సరళా, మా ఇంగ్లీషుసంగీతం నాకంతగా నచ్చదు. మీ అనుమతి తీసుకొని మీ వద్ద తెనుగుసంగీతం నేర్చుకోవాలని వుంది."

సరళ "అల్లాగే నేర్చుకుందురు గాని మీరు మాత్రము యాంగ్లోఇండియనులలో పుట్టవలసిన వారు కాదుసుమండీ! ఆంధ్రుల్లో పుట్టదగ్గవారు." అని నవ్వినది.

గ్రేస్ నవ్వుచు "ఇపుడైతే నేమి? మిస్ సరళ" అన్నది.

ఇటులే మాటాడుకొనుచుండగా బొమ్మూరుపల్లె సమీపించినది.

సరళాదేవి గ్రేస్ భుజముపై జేయివైచి ఆమె నాపు జేసి చుబుకమును బట్టుకొని "మిస్ గ్రేస్ మీ రెప్పుడైనా తెనుగుపల్లెటూరు చూశారా?" అన్నది.

గ్రేస్ "చూడలేదు."

సరళ "అయితే మీకొక ప్రార్థన వుంది. ఎల్లుండి అన్నయ్యా నేను మా మేనత్తవూరు అమలాపురం వెళ్లవలసిన రోజు. మీరు కూడా వస్తే చాలా అందంగా వుంటుంది. నేను మీ తండ్రిగారితో చెపుతాను. పల్లెటూరు జీవితం మీకు రుచి చూపిస్తాను. తప్పకుండా రావాలి."

గ్రేస్ ఆనందహృదయమున "అంతకన్నా ఏమిటి మిస్ సరళ. గ్రామ్యుల జీవనం లోతుగా తెలిసికోవాలని నాకు చిరకాలంనుంచి కోరిక వుంది. ఆవూళ్లో కారము ఎక్కువ వేసిన కూరలు మాత్రం పెట్టవద్దు. ఆమరతు మీదనైతే వస్తాను" అన్నది.

ముగ్గురు నవ్వుకొన్నారు.

ప్రకరణము ౩

ఆనాడు మధ్యాహ్నము గ్రేస్ ఈశ్వరదాసుగారి యింటిలో భోజనము చేసినది. ఆకసపురంగు చీరె సింగారించుకొని, చాక్లెట్ రంగు జాకెట్టు ధరించుకొనిన గ్రేస్, సరళాదేవి, రాధాకృష్ణ పడవదగ్గరకు ౧ గంటకు బయలుదేరినారు. అదివరకే యేర్పాటు చేయబడిన రెండు గదులలో నొకదాని యందు పెట్టెలు, పరుపులు, సామగ్రియునుంచి రెండవగదిలో ముగ్గురు నాసీనులైరి. పడవ మెల్లగా కదిలినది. అంతకుముందు కొంత గ్రేస్‌కు చదివి వినిపించిన రవీంద్రుని హోం అండు దివరల్డు అను పుస్తకము నుత్సాహముతో రాధాకృష్ణ విప్పినాడు. గ్రేస్ ఉద్విగ్నచిత్తముతో "కృష్ణబాబు, ఆరవప్రకరణం నుంచి చదవండి. ఇతివృత్తం చాలా బాగుంది. ఠాకూరు నిరుపమానమైన కవి లాగున్నాడే, అంతా సైకాలజీయే" అన్నది.

గ్రేస్, సరళాదేవి ఆత్రముతో వినుచున్నారు. కాని నడుమనడుమ గభీరనదీప్రవాహము తన దివ్యసంగీత

మును వినిపించుటకు గ్రేస్‌ను సరళాదేవిని ఆహ్వానించుచున్నది. అప్పుడు వృద్ధగౌతమీగభీరతరంగమాలికా మధురతమమంజులస్వనమునుండి ఒక యపూర్వవాణి "లోకము ప్రేమమయము, ఆనందమయము" అనుట వారి కుత్సాహజనకముగ శ్రుతిపర్వమైనది. ఉత్సాహోద్వేగముతో గ్రేస్ "కృష్ణబాబు, మానవనిర్మితమైన ఆనందదాయకవస్తువుల కంటే పరమేశ్వరకల్పితము లెక్కువవి కాదా! అటు చూడండి. సూర్యకిరణాలతో ఆడుకుంటూ మధురస్వరముతో దివ్యసంగీతం పాడుతూవున్న అలలు చూడండి. ఎంత ఆనందంగా ఉంది ఇవాళ. ప్రకృతిలో దేవుడు ఎంత సౌందర్యము పెట్టాడు" అన్నది.

సరళ "అవును మిస్ గ్రేస్, అంతేకాదు. ఆదినుండి సృష్టిఅందము దినదినము పెరిగిపోతూవుంది. ప్రకృతి తనఒడిలోకి రమ్మని మానవుల్ని ఆహ్వానించుతుంది. కాని వీళ్లువినడములేదు. వినలేక పోతున్నారు."

కొంతసేపు ముఘ్వురు కలిసి యాసౌందర్యానందము ననుభవించినారు. ఆమాధుర్యమునుగ్రోలినారు. గభీరభావగర్భితనదీప్రవాహములోని అనంతమైన పరమార్థము

వారి చిఱుతహృదయములను నుత్తూతలూగించినది.

పడవ మందగమనముతో వెళ్లుచునే యున్నది. మరల గ్రేస్ కోరికపై గ్రంథపఠనము మొదలుపెట్టినాడు రాధాకృష్ణ. నిరాతంకముగా చదువు సాగిపోవుచున్నది. ఆత్రముతో గ్రేస్, సరళాదేవియు నాలకించుచున్నారు. మధ్యమధ్య కొంతసేపు గ్రంథపఠన మాపుజేయుచు మరల చదువుచు కాలము గడుపుచుండిరి. సాయంకాలము నాలుగుగంటలకు సరళాదేవి స్టవ్వుపై ఫలహారము తయారుచేసినది. గ్రేస్ కాఫీ స్వయముగా గాచినది. ముఘ్వురు సల్లాపములతో నారగించిరి. మరల గ్రంథపఠనము. ఇటులే ఆనందోత్సాహసంభాషణముల మధ్య కాలము గడిచినది. ఎనిమిదిగంటలకు ముఘ్వురు నేకపంక్తిని గూరుచుండి భోజనము చేసినారు. మరల పుస్తకమును చదివినాడు రాధాకృష్ణ.

వెన్నెల వచ్చినతరువాత వారు పడవపైభాగమునకు వెళ్లి గూరుచుండిరి. గ్రంథపఠనము జరుగుచున్న కాలమున నొక్కొక్కప్పుడు గ్రేస్ పరాయత్తచిత్త యగుచుండెను. సరళాదేవి యీ సంగతి గ్రహించక పోలేదు. ఏయే ఘట్టములలో గ్రేస్ పరధ్యాన యగుచుండెనో

ఈమె గ్రహించినది. గ్రేస్ అకస్మాత్తుగా "కృష్ణబాబు, నామనసు బాగుండలేదు; ఆపుచేయండి'' అని సరళా దేవిని జూచి "మిస్ సరళా, ఈవెన్నెల్లో ఈపడవమీద సంగీతం పాడితే గాలి దేవుడు ఎంత సంతోషంతో దానిని తనపక్షాలమీద మోసుకొని వెళ్తాడో తెలియున్నా? ఏది ఫిడేలుతీయండి'' అన్నది.

ఎట్టి కారణము చెప్పినను గ్రేస్ ఊరుకొనదని సరళాదేవికి బాగుగా తెలియును. "అట్లయితే లోనికి వెళ్లుదాము పదండి'' అన్నది

ముప్పురును గదిలోనికి వెళ్లినారు. రాధాకృష్ణ చేతి గడియారము జూచి "పదైంది" అన్నాడు.

గ్రేస్ "ఒక్క అరగంటసేపు పాడినతర్వాత నిద్ర పోదాము. ఏది మిస్ సరళ, సంకల్ప మెట్టిదో పాడండి."

సరళాదేవి నవ్వుచు గొంతెత్తి అమృత ముట్టిపడు నట్లు మంజులస్వరమున మధురముగ బాడినది. భావార్థ మెరిగిన గ్రేస్ చిత్తమా పవిత్రగౌతమీతోయముల మీద నుండగనే చలించిపోయినది. చిత్తవిభ్రమము పరులకు తెలియకుండ నామె ముఖమును శూన్యాకాశము నకు ద్రిప్పి, ఆ దివ్యసంగీతము నాలకించుచున్నది. రాధా

కృష్ణుని హృదయవీణాతంతువులు గీతమును ఎవరికి విని పించకుండ లోలోన నాలపించినవి. గానసందేశమున రాధాకృష్ణ ఆశ్చర్యము చెందినాడు. తనకు తెలియ కుండగనే తన హృదయకుహరమున నేదియో దివ్యశక్తి నిరంతరముగ పెరిగి పోవుచున్న ట్లప్పు డాతనికి దోచి నది. సరళాదేవి ఆ ముఖచిహ్నములను గ్రహించినది.

సంగీతానంతరము పెట్టెలున్న గదిలో పరుపు వేసికొని రాధాకృష్ణయును, రెండవగదిలో నొకే శయ్యపై గ్రేస్, సరళాదేవియు పరుండినారు. గ్రేస్ నిర్మలచిత్త ముతో సరళాదేవి నవనీతసదృశకోమల కరపల్లవమును ముద్దిడి "మిస్, మీ కంఠంలో ఇంత మాధుర్యం ఎలా వచ్చిందో చెప్పరూ" అన్నది.

సరళ నవ్వి "మీ ముఖానికి ఇంత అందము ఎక్కడి నుంచి తెచ్చిపెట్టుకున్నారో చెప్పకూడదా?" అన్నది.

ఇరువురును పకపక నవ్వుకొన్నారు.

సూర్యోదయమైనది. ఆ మనోహర ప్రభాతసమయ మున అరుణప్రభలు గ్రేస్, సరళాదేవి వదనకమలము లపై బ్రసరించి వింత సోయగమును దెచ్చిపెట్టినవి. గ్రేస్ మేల్కొని ఉషాదేవిని సందర్శించి "మిస్ సరళ,

ప్రపంచం పుట్టాక ఎన్ని సూర్యోదయాలైనవో నాకు తెలియదు కాని ఇవాళ సూర్యోదయం మాత్రం అన్నిటి కన్నా ఎక్కువ అందంగా వుందని మాత్రం నిర్భయంగా చెప్పుతాను" అన్నది. సరళాదేవి ఆమె అమాయకపు హృదయమును గాంచి తనలో దాను నవ్వుకొన్నది. రాధాకృష్ణ మేల్కొని నాటి పవిత్రసమయమున యావ నాశాహృదయము లోచనములలో పరిస్ఫుటమగు చుండ మిస్ గ్రేస్‌ను దిలకించినాడు. గ్రేస్ కూడ నాతని వంక గభీరభావమున జూచి తలవంచినది. ప్రక్కనున్న పక్షులు కిలకిల మన్నవి. గ్రేస్ భావగర్భితదృక్కుల వలెనే విహంగనిస్వనము కూడ రాధాకృష్ణుని మంజుల హృదయవీణను మీటినవి. వీణాతంతువులు కలకల మని కదిలిపోయినవి.

ఇంక కొంత సేపటికి పడవ అమలాపురము చేరినది. సామానులు కూలివాండ్రు దింపినారు. రాధాకృష్ణ చేయి అందించి సరళాదేవిని ముందు దింపెను. తరువాత గ్రేస్ కోమలకరపల్లవమును బట్టుకొని ఆమె దిగుటకు సాయము జేసినాడు. అప్పు డాతని లేతహృదయము వణికి పోయినది. ఆంధ్రయువతియై పోయిన గ్రేస్

రాధాకృష్ణునిలో ఆ హృదయపరివర్తనము గ్రహియింపకపోలేదు.

* * * *

ఇప్పుడు వీరు వెళ్లినది ఈశ్వరదాసుగారి చెల్లెలు ఇంటికి. ఆమె యా యూరులోని సుప్రసిద్ధన్యాయవాది భార్య. ఆ సతీపతులు ఇరువురును విశాలభావహృదయులే యగుటచే గ్రేస్ రాక కమందానంద మొందినారు. తెలుగుపల్లెటూళ్లు గాంచ గ్రేస్ కుతూహలపడుచున్నట్లు వారికి తెలిసి యామె యభిలషితార్థము చక్కని యేర్పాటుల జేసిరి. మరుసటిరోజున న్యాయవాది, అతని భార్య గ్రేస్, సరళాదేవి, రాధాకృష్ణ—అందరును గలిసి బెండమూరులంక వెళ్లినారు. ఆ కొబ్బరితోటలు మామిడిచెట్లు గ్రేస్‌ను బాగుగా ఆకర్షించినవి. ఆ వాతావరణమే మధురముగ దోచినదా లేతహృదయమునకు. గభీరసముద్రతరంగధ్వని యామెను నవశను జేసివైచినది. మరునాడు బోడసకుర్రు వెళ్లి ఫలభరితమై నేత్రపర్వముగ నున్న వృక్షరాజములు, వరిపొలములు, ఆడంబరరహితజీవనులైయున్న గ్రామవాసుల జీవితములోని లోతు, గాంచి ఆనందించినారు. రెడ్డిగారి బంగాళాలో న్యాయ

వాది, అతనిభార్య యుండగా గ్రేస్ రాధాకృష్ణ, సరళా దేవి చుట్టునున్నతోట జూడనేగిరి.

గ్రేస్ "ఇక్కడ చాలా అందంగా వుంది. ఇక్కడి వారు నిజంగా అదృష్టవంతులే.''

సరళ "అదృష్టవంతులే అంటే లాభం లేదు. మీరు తెలుగు బాగా నేర్చుకొని ఆడంబర మెరుగని ఆంధ్రుల జీవితంలోని అందము అద్దములో చూపించినట్లు అనుప మానమైన నవల వ్రాయాలి. అప్పుడుగాని మీ మాటల వల్ల ప్రయోజనం వుండదు."

కృష్ణ "నిజమే. ఆంధ్రుల సాంసారికజీవితంలోని మాధుర్యము గ్రామజీవనంలోని లోతు తెలిపే గ్రంథాలు మనకు లేవు. గ్రేస్‌వంటి కుశాగ్రబుద్ధిమతి అటువంటి గ్రంథాలు వ్రాస్తే ఆంధ్రభాష ధన్యమవుతుంది.''

గ్రేస్ "అంత అదృష్టము కూడాను. మీకేదో నాపై గల వాత్సల్యంచేత అల్లా అంటున్నారు కాని.''

మరునాడు వారందరు రావులపాలెము వెళ్లినారు. వీరు బసచేసిన యింటియజమాని ఆరోజు వారి నచటనే ఆపుజేసివైచినాడు. పొలములు చూచి వచ్చి మెల్లగా యిల్లు చేరుకొనునప్పటికి సాయంకాలమైనది.

లోపల కూరుచుండి న్యాయవాది వెంట తెచ్చు కొనిన లాపుస్తకముల నవలోడించుచున్నాడు. ఆతని భార్యప్రక్క కూరుచుండి యెదో గ్రంథము పఠించు చున్నది. గ్రేస్, రాధాకృష్ణ, సరళాదేవి వీధియరుగుపై నాసీనులై సంభాషణలోనికి దిగిరి. అంతలో జూచు చుండగనే అంబరవీధి మేఘావృతమైనది. ఒకవైపున ఎఱ్ఱనిరంగు గలిగిన సూర్యనారాయణుడు అస్తాచలమున గ్రుంకుచున్నాడు. ఆ యానందోత్సాహభరితులకు యెదుట నొక పెద్దచెరు వున్నది. ఆ చెరువుచుట్టును కొబ్బరిచెట్లు, చిన్నయిండ్లు, మండువాభవంతులు నున్న వి. నీలాకాశము విమలసలిలమున ప్రతిబింబించుచున్నది. ఆవిన్నాణము గాంచి గ్రేస్ దిగ్భ్రమయై పోయినది.

గ్రేస్ "మిస్ సరళా, అబ్బా ఈ దృశ్యం ఎంత మనోహరంగా వుందో చూడండి. మనుష్యులు కట్టు కున్న పట్టణాలలో ఈ మనోహరత్వం రమ్మంటే ఎలా వస్తుంది. ఇటువంటి గ్రామాలు ఆధారం చేసుకొని నవల వ్రాస్తే ఎంత బాగుంటుంది!''

సరళాదేవి నవ్వుచు "మీవంటివారు వ్రాస్తే చాలా బాగుంటుంది'' అన్నది.

గ్రేస్ "నా కంఠశక్తి లేదేమో అని సందేహం.''

కృష్ణ "ఎవరిశక్తి వారికి తెలియదు లెండి!''

గ్రేస్ గభీరమైన ప్రేమమయదృక్కులతో నిసుమంత కోపమును సూచించుచు "అవును లెండి'' అన్నది.

సరళాదేవి మౌనము దాల్చినది. కొంతసేపైన తరువాత సరళాదేవి నవ్వుచు "మిస్ గ్రేస్, మీబుద్ధి కుశాగ్రమైంది—ఇటువంటివారు కాని ఈదృశ్యంలోని గభీరభావాలు, మాధుర్యరసం గ్రహించలేరు'' అన్నది.

గ్రేస్ గ్రామవాసుల జీవితము సూక్ష్మబుద్ధితో నానందించినది. మరునాడు వా రమలాపురము వచ్చి అచట రెండురోజు లున్నారు. ప్రయాణ మగుచున్నప్పుడు న్యాయవాదిభార్య గ్రేస్‌కు చక్కని చీరె, జాకెట్టు ఇచ్చి బహూకరించినది. వారు ప్రయాణసన్నాహులై ముక్తేశ్వరము, కోటిపల్లి, ద్రాక్షారామ జూచుకొనుచు కాకినాడ చేరినారు. ఆ యాంధ్రవాతావరణములో గ్రేస్‌కు అనంతమైన సౌందర్యము, మాధుర్యము గోచరించినవి. ఈ దృశ్యముల మూలమున ఆంధ్రాభిమాన మామె లేత హృదయమున ఇనుమడించిపోయినది. ఇపుడు గ్రేస్ సరళాదేవితో తప్ప రాధాకృష్ణతో నంత చనువుగా

మాటాడుట లేదు. రాధాకృష్ణ అందులకు కారణము "ప్రస్తుతోత్సాహమేమో. ఈ వూళ్ళు చూడడమువల్ల ఉప్పొంగిపోయిన ఆనందమువల్లనేమో" అనుకొన్నాడు. కాని నిజకారణము మాత్రము సరళాదేవి బాగుగా యెరుగును. ఆ చూపులలోని పరమార్థము ఆమె కిదివరకే బోధపడిపోయినది. అందుచేతనే ఆమె కోటిపల్లి దగ్గర గ్రేస్‌ను జూచి "మిస్ గ్రేస్, చీరెకట్టు కొన్న తర్వాత అందముతో పాటు యురేపియన్ హృదయము కూడా మారిపోయినట్లుంది" అన్నది. గ్రేస్ నవ్వి యూరకున్నది.

నాలుగుమాసములు గడిచినవి. అలంకారములు లేక శూన్యమైయున్న నొక గదిలో నాతడు భక్తహృదయమున నిట్లు అంజలి నర్పించుచున్నాడు: "తండ్రీ! మేము నీ బిడ్డలము. అమాయకులము. నీ కృపాకటాక్షముపై మా స్థితి అధారపడి వుంది. నీ దయామృతముపై మేము ఆశపెట్టుకొని వున్నాము. నీవే మా దిక్కని హృదయపూర్వకంగా నమ్మి వున్నాము. మా ఆశలను నెరవేర్చి మమ్మల్ని ఉద్ధరించు. మా హృదయాలలో నీపై భక్తి రెట్టింపు బలముతో దృఢపడేట్టు ఆశీర్వదించు. నీ దివ్యసన్నిధానము మే మనుభవించేట్టు మాకు ధృడతరమైన భక్తి యివ్వు. సర్వదా నీ దివ్యమంగళమూర్తిని, నీప్రేమానందైకస్వరూపాన్ని, శాంతధామాన్ని, అనుభవించగల శక్తి ప్రసాదించు. తండ్రీ, నీ దయకోసము తపించిపోవుచున్న ఈ శూన్యహృదయంలో నీ దివ్యజ్యోతి వెలిగించు. దినదినము నీ ఆశీర్వాదబలమువల్ల పైమెట్టు ఎక్కవలసిన నేను తగిన

బలము లేకపోవడము చేత అణిగిపోతూన్నానేమో అని భయము వేస్తూంది. చిన్నచిన్న భేదాలు, సుఖదుఃఖాలు అనే తారతమ్యము, అహంభావము పూర్తిగా నన్నింకా వదలకుండా వున్నవి. రోజురోజుకి పై మెట్టు ఎక్కవలసిన ఈ చిన్ని హృదయము ఇంకా పవిత్రవంతము కాలేక పోతూంది. ఇందులకు నీ ఆశీర్వాదబలము లేక పోతే నేను అధఃపాతాళానికి అణిగి పోతానేమో నని భయము వేస్తుంది. తండ్రీ, ఈ చిన్నికుమారునిపై నీ కింకా దయ కలగలేదా? ఇంకా నే నెన్నాళ్ళు ఈ విధంగా చిన్నిచిన్ని భేదాలతో అంధకారంలో వుండాలి. తండ్రీ! ఎల్లప్పుడు నీ సన్నిధానములో వుంచుకొని, నీ కృపాకటాక్షము ప్రసాదించి ఈ కృంగిపోయిన హృదయాన్ని లేవదీయరాదా! ప్రభూ! మిగిలివున్న అహంభావాన్ని అంతరింప జేయుము. భిన్నత్వభావము అడుగంట అణిచివేయుము. ఒక నీ స్వరూపము మాత్రమే సర్వము నిండివున్నట్లు తెలిసికోవడానికి ఒక నీ ప్రకాశమే సర్వవస్తువులందు ప్రకాశించుచున్నట్లు గ్రహించడానికి, తగిన బలము నిచ్చి సర్వదా నీ సౌందర్యమూర్తినే అనుభవించేట్లు ఆశీర్వాదించు. తండ్రీ,

అంతకంటె ఈ తప్తహృదయానికి కావలసిందింకేముం
టుంది. అప్పుడే నా జీవితం ధన్యమవుతుంది. నీ దివ్య
జ్యోతి నాలో కూడా వెలుగుతుంది. నీ దివ్యస్వరూ
పము, ప్రతినిముషము, ప్రతి అణువునందు విలోకించి
ఆనందిస్తూ వుంటాను. ఓం శాంతి శ్శాంతిః శ్శాంతిః"

ప్రార్థనామందిరమున ఈశ్వరదాసు ఒక్కడే కూరు
చుండిపరమేశ్వరసన్నిధానమున నీవిధముగ చిన్ని బాలుని
వలె కించిన్మాత్రమైన అహంభావము లేక అంజలి ఘటించి
ప్రార్థన జేసినాడు. ప్రతిదినము నుదయమున కుటుంబ
మంతయు నొకరి తర్వాత నొకరు వెళ్ళి ఈ చిన్ని
మందిరమున పరమేశ్వరప్రార్థన చేయుటఆచారము. నేడు
ఈశ్వరదాసు మందిరము వెలుపలికి వచ్చునప్పుడు నూత
నోత్తేజముతో, తేలికయయిన హృదయముతో వచ్చి
నాడు. ఇప్పు డాతని హృదయముపై నున్న నేదియో
బరువైన పదార్థము తొలగిపోయినట్లున్నది. ఇంతలో
సేవకు డుత్తరము తీసికొని వచ్చి ఈశ్వరదాసు చేతిలో
నుంచినాడు. లేఖ:

శ్రీ నాన్నగారి సముఖమునకు మీ ప్రియపుత్రు
డనేక నమస్కారములతో బంపిన విజ్ఞాపనము.

పరమేశ్వరుని ఆశీస్సుబలము వల్లను, మీ యాశీర్వా
దము వల్లను నేను కులాసాగా నున్నాను. పరీక్షకు కష్ట
పడి చదివినాను. అట్లన్న చో దివారాత్రములు నేకదీక్ష
తో నారోగ్యమునకు భంగము కలుగునట్లు చదివినానని
మీరు తలంపవద్దు.మీయాజ్ఞానుసారముశరీరారోగ్యము,
మానసికారోగ్యము చెడకుండ బహుజాగ్రత్తతో చదివి
నాను. పరీక్షలు నిన్నటితో నైనవి. ఈ సరికి కలకత్తా
విడువవలసిన సమయమైనను నొకానొక కారణాంతర
ముచే నట్లు చేయజాలకపోతిని. తన్మూలమున పరీక్షలయిన
వెంటనే బయలుదేరి రావలెనను మీ యాజ్ఞ నుల్లం
ఘించినందుకు విచారించకుండ నుండజాలను.

వికసనసమయము వచ్చునప్పటికి గులాబిపువ్వు
ప్రఫుల్లము కాకుండ నుండజాల దను సంగతి మీకు
తెలియనిది కాదు. అటులనే నా హృదయసుమము
కూడ నేడు వికసించి యొక జీవి నాకర్షించినది. ఎన్ని
నాళ్లనుండియో హృదయాకాశము నందు మాకు తెలి
యకుండగనే ప్రకాశమానమై యున్న ఆ దివ్యజ్యోతిని
మేము నేడు కనుగొన గలిగినాము. ఆ మనోహర సంగీ
తమును నే డాలింప గలిగినాము. నేడుగదా మా జీవిత

ములు ధన్యమైనవని ఇర్వురము నొక్కసారి యానంద పడితిమి. ప్రేమైక జీవనములోని మాధుర్యము నొక్కసారిగా అనుభవించుట తెలిసికొంటిమి. ఇతరులకు తెలియకుండగనే పరస్పరబద్ధహృదయులమై ఆయానందములోని మాధుర్యమును, ఆ ప్రేమలోని నిగ్గును నిరంతరాయముగ ననుభవించుచున్నాము. ఈ మా ఆనందమునకు దోహదము చేసి పుణ్యము కట్టుకోవలసిన వారు మీరు. మా యిర్వురి జీవితములును ధన్యతమ మొనర్పగలవారు మీరుతప్ప నింకొకరు లేరు. అందుచే విశాలహృదయులు భక్తులు నగు మీరు మా యాశాలత త్రెంపి వేయ జాలరని నమ్ముచు మీ యనుమతి కొర కాత్రముతో నెదురు చూచుచున్నాము.

గ్రేస్ యెడ నాకున్న ప్రేమాతిశయమును నే నామెకు వెల్లడించుటకు ధైర్యము చాలక ఎన్నాళ్లనుండియో మౌనము దాల్చి యున్నాను. నాహృదయపరివర్తనము నామె కనిపెట్టక పోలేదు. మొన్నటిదినము సుదినము. ఆరోజునే ఆమె తన హృదయస్థరహస్యభావమును దెలుపుచు తన అర్పితహృదయము నే నానందముతో నంగీకరించవలసినదిగా నుత్తరము వ్రాసినది. నా హృద

యము ఒక్కసారిగా ప్రణయప్రభంజనాహతికి కదిలిపోయినది. నా కంతధైర్య మున్నదా? అనుకొన్నాను. కాని ఆలోచించగా మీ వంటి యుత్తమ జనకుని పుత్రుడనై యుండి అట్లధైర్యపడుటకు కారణము లేదని ధైర్యము చిక్కబట్టుకొన్నాను. నే నింకను గ్రేస్‌కు నా యనుమతి తెలిపి యుండలేదు. మీ యాజ్ఞ గైకొని యామె కుత్తరము వ్రాయవలెనని యెంచినాను.

మీ వంటి భక్తహృదయులకు విశాలభావవిరాజిత మానసులకు నేను క్రొత్తగా చెప్పవలసినదేమియు నుండదు. ఆమె యాంగ్లోఇండియను, నేనాంధ్రుడనని మీరు తలంపవద్దు. ఈ భేదములన్నియు మానవులు మానసిక దౌర్బల్యము వలన తెచ్చి పెట్టుకొనినవే కాని పరమేశ్వరుని విశాలదృష్టిలోను, ప్రేమ సామ్రాజ్యమునను నిట్టి భేదములు లేవని నేనిపుడు క్రొత్తగా మీకు చెప్పవలసిన యవసర ముండదు.

కనుక మీయంగీకారము తెలుప వినయవినమితుడనై వేడుచున్నాను. మా చెల్లెలు సరళాదేవిని కూడ నాలోచించప్రార్థించెదను. చిత్తగించవలెను.

కలకత్తా

రాధాకృష్ణ.

అప్పుడే పరమేశ్వరప్రార్థనమున భేదభావమడంచి ఏకత్వభావము కలిగింపుమని కోరిన ఈశ్వరదాసునకు ఈయుత్తరము నిరవధికానందము గూర్చినది. లేఖాపఠనమైన వెంటనే యాతడు మరల ప్రార్థనామందిరమును బ్రవేశించి ‹పరమేశ్వరా! ఈ నవదంపతులను, నీవాశీర్వదించి వారిని దృఢతర ప్రేమానుబంధమున నైక్య మొనర్పుము. నేడే నీసన్నిధానమున వారు దంపతులై పోయినారు. వారి జీవితముల నొక్కటిగా జేసివైచి ప్రేమలహరిలో తేల్చివేయుము. నీయాశీర్వాదమే వారిరాగబంధము” అని ప్రార్థించినాడు.

ఎదో తెలియని మధురవాణి “శుభమస్తు” అన్నట్లాతనికి శ్రుతిపర్వమైనది. అప్పుడాతని కనుఁగొలంకుల నుండి యాతనికి తెలియకనే ఒకటి రెండు ఆనంద బాష్పబిందువులు జారిపడినవి.

ప్రకరణము ౪

స్టేషనుమాస్టరు భవనమును చుట్టియున్న మనోహరోద్యానమున నొక బొగడచెట్టు క్రింద రెండు పేము బెత్తపు కుర్చీలలో రాధాకృష్ణ గ్రేస్ ఉపవిష్టులై యున్నారు. మందమైన సూర్యకిరణములు లేతయాకుల నడుమనుండి వచ్చి గ్రేస్ ముంగురులపై తాండవమాడుచున్నవి. రాధాకృష్ణ సూర్యదీప్తిలో మెరిసిపోవుచున్న ఆ ముచ్చటైన ముంగురుల నవలోకించుచు “గ్రేస్, బ్రాహ్మసమాజమంటే ఆధ్యాత్మికోపాసకులకూటమి అన్న మాట. ఈ సమాజమునకు దైవసాన్నిధ్య మనుభవించుటే ముఖ్యం. కడమ నిబంధనలన్నీ దాని ననుసరించే వున్నవి.”

గ్రేస్ “అయినను బ్రాహ్మసమాజ మొక ప్రత్యేక మత మన్నమాటయే కదూ!”

కృష్ణ “గ్రేస్, అల్లాకాదు. ఇది ప్రత్యేకమతమని దీన్ని బాగా తరచని వాళ్లు మాత్రమే భ్రమపడుతున్నారు. ఇది ప్రత్యేకమత మెలా అవుతుంది! క్రిస్టి

యన్ అయినా మహమ్మదీయుడైనా హిందువైనా విశాల భావాలు కలిగివుంటే ఆనందముతో స్వాగతమిస్తూన్నప్పుడు. క్రిస్టియన్ తాను క్రిస్టియన్‌గానే వుండవచ్చు; మహమ్మదీయుడు మహమ్మదీయుడుగానే వుండవచ్చు; విశాలమైన భావాలు కలిగి వుండి ఉపాసనాశీలుడైతే అతడు బ్రాహ్మకూడా అవుతాడు. ఇదే దీంట్లో వున్న గొప్ప తనం. అటువంటి సున్నితమైన భావాలతోనే దేవేంద్రనాథ్ మహర్షి, కేశవబాబు దీన్ని పునరుద్ధరించారు. ఇంతకు బ్రాహ్మసమాజమంటే ఉపాసకులకూటమి అన్నమాట. ఇది ప్రత్యేకమతము కూడాకాదు."

గ్రేస్ "అయితే ఈసమాజంలో ఎవరైనా కలవాలనుకుంటే"

కృష్ణ "ఇందులో కలియడమంటూ వేరేలేదు. క్రైస్తవుల మాదిరి దీనికి బేప్టిజంలేదు. విశాలమైన భావాలు ఎవరి హృదయాలలో విజృంభించి ప్రకాశించునో అట్టివారికి చిన్ని చిన్ని భేదాలు, కులతత్వమువదిలిపోయి వారంతట వారే బ్రాహ్మలయిపోతారు. అప్పుడేవారంతాదైవసాన్నిధ్యంలో ఒకేదివ్యపీఠముపై కలిసి ప్రేమానందాలు అనుభవించుతారు."

గ్రేస్ "అయితే కృష్ణబాబు, మరి బ్రాహ్మలు దీక్ష అంటారేమిటి? నాకు కాస్త తెలియ చెప్పండి."

కృష్ణ "గ్రేస్, బ్రాహ్మలకు దీక్షవుంది కాని క్రైస్తవులబేప్టిజంకు దీనికీ ఏమీ పోలిక లేదు. బేప్టిజం అయితేనే గాని క్రిస్టియను కాజాలడని వారి లోక నమ్మిక ప్రబలంగా వుంది. కాని బ్రాహ్మల దీక్ష అటువంటిది కాదు. ఈ దీక్షకు ప్రాముఖ్యత ఏమీలేదు. దీక్ష పుచ్చుకుంటేనే గాని బ్రాహ్మకాడని, పుచ్చుకుంటే అవుతాడని వీరి నమ్మకము కాదు. రవీంద్రుడువంటి విశాల భావాలు కలవారు ఇదే పదేపదే చెపుతున్నారు. ఇంతకూ కించిన్మాత్ర భేదాలు నశించి విశాలమైనభావాలు కలిగి పరమేశ్వరుని మననము చేసే ప్రతివ్యక్తీ ఈ ఆధ్యాత్మికోపాసకులకూటమిలో దీక్ష పుచ్చుకున్నా, పుచ్చుకొనక పోయినా చేరుతాడు. అప్పుడతడు బ్రాహ్మ అన్నమాట. అందుచేతనే ఈ ఉపాసకులకూటమి హిందువులను, మహమ్మదీయులను, క్రైస్తవులను, శైవులను, జైనులను, పారసీలను అందరినీ ప్రేమహస్తాలతో ఆహ్వానించుతూంది. ఈ కూటమిలో అటువంటి భేదాలకు చోటులేదు."

గ్రేస్ "అబ్బా యిప్పటికర్థమైంది కృష్ణబాబు. ఎల్లాగైనా పుస్తకాల్లో చదివేదానికి ఒకవ్యక్తి ఎదురుగా వుండి బోధచేసేదానికి చాలా తేడావుంది సుమండీ. మీరిచ్చిన బ్రాహ్మమతగ్రంథాలు చదివినానన్నమాటే కాని ఈ ముఖ్యాంశము బాగా బోధపడింది కాదు. ఇప్పుడు బాగా తలకెక్కినదండీ, కృష్ణబాబు."

రాధాకృష్ణ నవ్వుచు "అయితే ఇప్పుడేమిటిచేయడము" అన్నాడు.

గ్రేస్ వ్రీడాభరమున తలవంచి చిఱునగవుతో "కృష్ణబాబు, అయితే మనము బ్రాహ్మల్లో కలియ నక్కఱలేదన్నమాటే కదూ."

కృష్ణ "అవసరము లేదు. కలియడమంటూ వొకటి వుంటే కదా, మనము దానిలో కలియుట (నవ్వుచు) గ్రేస్, దేనికి మనము దానిలోకలియడము?"

అప్పుడు గ్రేస్ తరళనయనములలో నామె హృదయకుహరమున దాగుకొనియున్న చిఱునగవు ఒక్కసారిగా వ్యక్తమయినది. ఆమె మెల్లగా "మీకు తెలియదాయేమిటి?" అన్నది.

కృష్ణ "గ్రేస్, నాకు తెలియకనే కదా నిన్నడగ

డము" అని నవ్వినాడు.

గ్రేస్ శాంతమధురస్వరమున "మీరల్లాఅంటే చెప్తాను వినండి. మన వివా——" ఇక మాటాడలేకపోయినది.

కృష్ణ "గ్రేస్, తెలిసింది. ఇక చెప్పనక్కఱలేదు. అన్నట్టు మరిచిపోయాను. వీరేశలింగముపంతులుగారితో మాటాడాను. ఆయన్ని గురించి ఇదివరకు నీకు చెప్పేవున్నాను. బ్రాహ్మలపద్ధతిగా చేయడానికిన్నీ, ఆయన ఆచార్యపీఠం ఆక్రమించుటకున్నూ మాటాడివచ్చాను"

గ్రేస్ "చాలా బాగుంటుంది. కాని ఈసమయంలో నాకు మనము అపరిమితానందంలో గడిపిన సంవత్సరాదిరోజు జ్ఞాపకము వస్తూవుంది సుమండీ."

* * * *

వీరేశలింగముపంతులుగారి తోటలోని భవనమంతయు పచ్చనితోరణములతోడను, రంగురంగుకాగితములదండలతోడను మనోహరముగ నలంకరింపబడినది. జనులు క్రిక్కిరిసియున్నారు. హైంధవులు యాంగ్లోయిండియనులు నేడీభవనమున నొక్కహృదయముతో నాసీనులైయుండిరి. అందరు నాత్రముతో గాంచుచుండగనే

వీరేశలింగముపంతులుగారు, రాధాకృష్ణ, ఆకుపచ్చని సిల్కుచీరె ధరించుకొనినగ్రేస్, సరళాదేవి వచ్చి కూరుచుండిరి. ఆనందపులకితశరీరములతో ఈశ్వరదాసు, స్టేపనుమాస్టరు పురుషుల నడుమను, ఈశ్వరదాసుసతి, స్టేపనుమాస్టరుభార్య యువతీబృందముమధ్యను కూరుచుండి యున్నారు. గ్రేస్‌పరిచితలగు యాంగ్లోయిండియను రమణీమణులు సీతాకోకచిలుకరంగులవస్త్రముల నలంకరించుకొని వచ్చియుండిరి. అంతటను నిశ్శబ్దముగ నున్నది.

ప్రథమమున నొకకీర్తనపాడినారు. వరుడును, వధువును, ఆచార్యుడును తమ స్థానములందాసీనులయిన తరువాత ఆచార్యుడైన వీరేశలింగముపంతులు ఈ విధమున వివాహమహోత్సవము నుపక్రమించెను.

శ్లో॥ ఓం యో దేవోఽగ్నౌ యోఽప్సు
యో విశ్వంభువనమావివేశ
య ఓషధీషు యోవనస్పతిషు
తస్మై దేవాయ నమోనమః.

(ఏ దేవుడు అగ్నియందును, జలమునందును, తరుగుల్మలతాదుల యందును, వృక్షముల యందును,

లోకమందెల్లెడలను వ్యాపించి యున్నాడో ఆదేవునికి నమస్కారము. నమస్కారము.)

శ్లో॥ నమశ్శంభవేచ మయోభవేచ నమశ్శంకరాయచ
మయస్కరాయచ నమశ్శివాయచ శివతరాయచ.

(నీవు సుఖకరుడవు. కళ్యాణకరుడవు. సుఖకళ్యాణముల కాకరుడవు. కళ్యాణుడవును, కళ్యాణతరుడవును, నీవే. నీకు నమస్కారము.)

ఆచార్యుడు (వరునితో) శ్రీమాన్ రాధాకృష్ణ! నీవు పరమేశ్వరుని యెదుటను, ఈ సభ్యుల సమక్షమునను, నీయంతట నీవు నీ యిచ్ఛాపూర్వకముగా ఈ సౌభాగ్యవతి యగు శ్రీమతిగ్రేస్‌ను, నీధర్మపత్నిగా స్వీకరించుటకు కృతసంకల్పుడవయినావా?

రాధాకృష్ణ: కృతసంకల్పుడ నయినాను.

ఆచార్యుడు: (వధువుతో) శ్రీమతిగ్రేస్! నీవు పరమేశ్వరుని యెదుటను, ఈ సభ్యుల సమక్షమునను నీయంతట నీవు నీయిచ్ఛాపూర్వకముగా ఈ శ్రీమాన్ రాధాకృష్ణను నీపతిగా స్వీకరించుటకు కృతసంకల్పురాలవయినావా?

గ్రేస్: కృతసంకల్పురాలనయినాను.

ఈశ్వరదాసు, స్టేపనుమాస్టరు నయనములనుండి యానందబాష్పములు భూమిపై బడినవి. సభ్యులు తమలో తాము "నేడు బ్రాహ్మసమాజము, దానితోపాటు ఆంధ్రజాతీ ధన్యమైన" వని గుసగుస లాడిరి.

ద్వితీయ కీర్తన పాడిన తరువాత బ్రహ్మోపాసన మైనది. పిదప మరియొక కీర్తనను బాడిరి. తరువాత ఉద్వాహప్రతిజ్ఞ ఈ విధమున చేయబడినది.

రాధాకృష్ణ "శ్రీమతి గ్రేస్! ఈపింగళ సంవత్సర శ్రావణబహుళ విదియ ఆదివారమునాడు రాధాకృష్ణ అను నేను సర్వసాక్షియును సత్యస్వరూపుడును నైన పరమేశ్వరుడు సాక్షిగా సమావేశులైన యీ బంధుమిత్రుల సమక్షమున నిన్ను నా ధర్మపత్నిగా నాయంతట నేను నా యిచ్ఛానుసారముగా పరిగ్రహించుచున్నాను. సుఖమునందును దుఃఖమునందును, సంపదయందును ఆపదయందును, ఆరోగ్యదశయందును అనారోగ్యదశయందును, నీ సహచరుండనై నీశ్రేయోభివృద్ధి కొఱకు సర్వదా ప్రయత్నించెదను. నా హృదయము నీయది యగు గాక! నీహృదయము నాయది యగు గాక! మన యిరువుర హృదయము లేకమై పర

మేశ్వరునివి యగు గాక!

గ్రేస్ వరునితో: శ్రీమాన్ రాధాకృష్ణబాబు! ఈ పింగళసంవత్సర బహుళ విదియ ఆదివారమునాడు గ్రేస్ అను నేను సర్వసాక్షియును సత్యస్వరూపుడు నైన పరమేశ్వరుడు సాక్షిగా సమావేశులయిన యీ బంధుమిత్రుల సమక్షమున మిమ్ము నాపతిగా నాయంతట నేను నా యిచ్ఛానుసారముగా పరిగ్రహించుచున్నాను. సుఖమునందును దుఃఖమునందును, సంపదయందును ఆపదయందును, ఆరోగ్యదశయందును అనారోగ్యదశయందును, మీ సహచారిణినై మీ శ్రేయోభివృద్ధి కొఱకు సర్వదా ప్రయత్నించెదను. నా హృదయము మీయది యగు గాక! మీహృదయము నా యది యగు గాక! మన యిరువుర హృదయము లేకమై పరమేశ్వరునివి యగు గాక!

గ్రేస్ ఈ విధముగ ననిన పిదప వధూవరులు పుష్పహారములు నొండొరులకంఠములను వేసికొనిరి. ఆసమయమున ఈశ్వరదాసు స్టేపనుమాస్టరు హృదయములు ఆనందముతో నుప్పొంగిపోయినవి. సభ్యులలో నొకడు మిత్రునితో "పుష్పహారాలు వేసేప్పుడు వారి హృద

యాలలో ఏముంటుందో చెప్పవోయి" అన్నాడు.

మిత్రుడు "ఏముంటుంది! అప్పుడు వారి హృదయాలలో ఎట్టి భావమూ వుండదు. ఎట్టికోరిక ఉండదు. అప్పుడవి విమలమై శూన్యమై ఉంటవి." అన్నాడు. సభ్యులైక్యకంఠమున స్వస్తివచనము జెప్పినారు. తరువాత వధూవరులు మిళితప్రార్థనము నీవిధముగ చేసిరి. "సకలశుభప్రదాయకుడవైన యోపరమేశ్వరా! మేమీ దినమున జేసికొనిన పవిత్ర ప్రతిజ్ఞలను సర్వదా పరిపాలించునట్లు మాకు సహాయుడవగుము."

చతుర్థకీర్తన పాడినపిదప ఆచార్యుని హితోపదేశము, ప్రార్థన, ఆశీర్వచనము కూడనైనవి.

నమస్తే నమస్తే జగజ్జన్మహేతో!
నమస్తే నమస్తే మహత్కీర్తికేతో!
నమస్తే నమస్తే మహాపుణ్యసేతో!
నమస్తే నమస్తే నమస్తే మహేశ!

తరువాత నెల్లరు నైక్యమధురస్వరమున మంగళకీర్తన బాడిరి.

మిత్రులు ప్రహృష్టహృదయులై రాధాకృష్ణకు గ్రేస్‌కు బంగారుగడియారములు, కెమేరాలు, ఆంధ్రఆంగ్లేయ

గ్రంథములు, దువ్వాలువలు, స్వర్ణభూషణములు మఱియు ననేక అమూల్యాలంకారములు ఉపహారములుగా నొసంగిరి. నవదంపతులు సంఫుల్లహృదయములతో నుపహారములనెల్ల గైకొన్నారు.

• ఆచార్యుడైన వీరేశలింగముపంతులు సంతోషిత హృదయమున నొక మిత్రునితో "ఎన్నో వితంతూవివాహాలు చేశానుకాని నేడు కలిగినంతఆనందము ఎప్పుడూ కలుగలేదండీ! నేను బ్రతికి, బాగావుండి నాస్వీయచరిత్ర మూడవభాగము వ్రాస్తే ఈ ఉత్తమవివాహము గురించి ఇరువయిపుటలకు తక్కువకాకుండా వ్రాస్తాను. ఈ పెండ్లి మూలంగా జాతిభేదం నశించడమే కాకుండా ఇటు ఆంధ్రజాతికి అటు యాంగ్లోయిండియనుజాతికి మొత్తముమీద లోకానికి శోభ కలిగింది. తప్పక ఈదంపతులు సౌఖ్యమనుభవించుతారు." అన్నాడు.

* * * *

ఈశ్వరదాసు కఠినపుసంఘము పెట్టు బాధలకు తలయొగ్గువాడు కాదు. అతనికిట్టి బాధలవల్ల నావంతయు భయము లేదు. గ్రేస్ వారమురోజులు ఈశ్వరదాసుని యింటనే యున్నది. తరువాత అతనికోరికపై నా నవ

దంపతులు గ్రీష్మమును నీలగిరిపర్వతముపై గడుప బ్రయాణమైరి. ఆనందహృదయమున సరళాదేవి విజయవాడవఱకు బంపుటకు గ్రేస్ కోరికపై బ్రయాణమైనది. వత్సరాదినాడు బహుమానమందిన పనికత్తె కూడ రాధాకృష్ణ ఆజ్ఞానుసారము నీలగిరిపర్వతమున్నకు ఉప్పొంగిపోవుచున్న హృదయముతో బయలుదేరినది.

ఆనాడు సాయంకాలము రాజమహేంద్రవర రైల్వేస్టేషనుప్లాటుఫారము జనులతో కిటకిట లాడుచుండెను. యాంగ్లోయిండియను యుద్యోగీయులెల్లరును నాసమయమున నచటనే యుండిరి. మెల్లగా రైలుకదలినది. గ్రేస్ ఎంతో విచారమును సూచించునయనములతో జననీజనకులను, ఈశ్వరదాసు దాసుసతివైపు జూచినది. అప్పుడామె హృదయాంతరమున నెవరికి తెలియకుండ దాగియున్నమధురార్ద్రిభావములు ఆ శాంతమయనయనములలో నొక్కమారుగా పరిస్ఫుటమయినవి. "మిమ్మల్ని విడిచివెళ్ళడము కష్టమైనపని. సంఘాన్ని ధిక్కరించి ఈ వివాహం చేసుకోవడములో నా కింతకష్టము కనిపించలేద" ని యామె ఆర్ద్రిహృది పులకరితనేత్రముల మూలమున అంతరిత ప్రభావములను వెలిబుచ్చినది.

తలిదండ్రులటులే ఆ పులకరితమనోహరనేత్రముల వీక్షించుచు నిస్తబ్ధులై నిలువబడిపోయినారు. యాంగ్లోయిండియనురమణులు చేతిరుమాళ్ళ నూపియు, చేతుల నూపియు తమతోషితహృదంతరభావములను దెలిపిరి. చెల్లికత్తెలకు తన మనోహరతరళనయనములతోడనే గ్రేస్ జవాబు చెప్పినది. అందరు నాబండివైపు తదేకదృష్టితో జూచుచు గ్రేస్ రాధాకృష్ణ ప్రేమానుబంధమును భావించుకొన్నారు. కొందఱా ఆదర్శప్రాయరాగబంధమును సానందముగ నుతించినారు.

ఒక చిన్న అమాయకపు యాంగ్లోయిండియను బాలిక జనకుని జూచి "డేడీ! నేను కూడా హిందూను పెళ్ళిచేసుకుంటే, యిల్లాగే నీలగిరి వెళ్ళవచ్చు కదూ" అన్నది.

ముందు రాబోవు గ్రంథములు

కర్త: న. వేంకటరత్నముగారు

పరివర్తనము: స్వతంత్రకథలసంపుటి

ఇందలి కథలు కొన్ని ఇంగ్లీషులోనికి తర్జుమా చేయబడి
కలకత్తా Indian Story Teller లో ప్రకటింపబడినవి

పతివ్రత: స్వతంత్రసాంఘికనవల

SARASWATHI POWER PRESS
RAJAHMUNDRY

END OF
TITLE